క్లుప్తంగా

జిమ్ చేసి.. కుప్పకూలి.. వ్యక్తి మృతి



వినుకొండ : పట్టణంలో ఓ జిమ్ సెంటర్‌లో గురు వారం ఉదయం జిమ్ చేసి బయటకు వచ్చి ఓ వ్యక్తి మృతి చెం దిన సంఘటన చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన శ్రీను అలియాస్ కిచిడి శ్రీను ఉదయాన్నే జిమ్ చేయడానికి వచ్చిన జిమ్ అనంతరం వెయిట్ చెక్ చేసుకున్నాడు. అనంతరం బయటకు వెళ్లే క్రమంలో డోర్ దగ్గరే ఉన్నట్లు ఉండి కుప్పకూలిపోయాడు. కింద పడుతున్న శ్రీనుని గమనించిన జిమ్ నిర్వాహకులు వెంటనే పట్టుకున్నారు. సభ్యుల సహాయంతో ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స అందించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లభించలేదని గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని జిమ్ నిర్వాహకులు తెలిపారు. జరిగిన సంఘటన మొత్తం సీసీ కెమెరాల్లో రికార్డు అయింది.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

- తహసీల్దార్ ఎస్‌కే ఎండీ హుస్సేన్
- రేపు రక్తదాన శిబిరం



చిలకలూరిపేట: రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా నిలవాలని రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు, చిలకలూరిపేట తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రక్త నిల్వలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వివిధ తేదీలలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమాజంలోని ఆరోగ్యవంతులంతా రక్తదానం చేయవచ్చని, ముఖ్యంగా యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు.

డ్రెయినునూ వదలిపెట్ట లేదు!

- పల్నాడు రోడ్డులో డ్రెయిన్‌పై షాపుల ఏర్పాటుకు ప్రయత్నం
- వారించామంటున్న మున్సిపల్ ప్రణాళికా అధికారి

నరసరావుపేట: అధికార పార్టీ నాయకుల ప్రమేయంతో మురుగుపారే డ్రెయిన్లు ఆక్రమణకు గురవుతున్నా మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఒకవైపు పట్టణం మొత్తం డ్రెయిన్లపై నిర్మాణాలు, రోడ్ల మార్జిన్లలో ఆక్రమణలు తొలగిస్తామంటూ అధికారులు బీరాలు పలికి వినుకొండరోడ్డు, పల్నాడు రోడ్లలో ఆ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే తాము నియోజకవర్గ ముఖ్య నేత మనుషులమంటూ కొంతమంది వ్యక్తులు నూతనంగా పల్నాడురోడ్డు ఎస్ఎస్ఎన్ కళాశాల పక్కన మెయిన్‌రోడ్డుకు దక్షిణ వైపున డ్రెయిన్లను ఆక్రమించేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవటంలో విఫలమౌతున్నారనే విమర్శలు పట్టణ ప్రజల నుంచి వ్యక్తమౌతున్నాయి.

కళాశాల పక్కనే ఉన్న హిందూ శ్మశాన వాటికకు రోడ్డువైపు ప్రహరీను ఆనుకొని కొన్ని ఇళ్ల ఉన్నాయి. దాని ముందు నివాసితులు రాకపోకలు సాగించేందుకురోడ్డు, ఆ తర్వాత మళ్లీ ఇళ్లు, వాటి తర్వాత రోడ్డువైపుకు డ్రెయిన్ ఉంది. ఆ డ్రెయిన్‌ను ఆనుకొని రోడ్డుపైకి కొంతమంది వ్యక్తులు టైర్ పంక్చర్ షాపులు, ఇతర షాపులు ఏర్పాటుచేసుకున్నారు.



డ్రెయిన్ ఆక్రమించేందుకు పైపులు వేసిన దృశ్యం

దీంతో మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపైకి వచ్చిన షాపులను తీసేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆయా షాపులకు చెందిన వ్యక్తులు స్థానిక టీడీపీ నాయకుల సహకారంతో షాపుల వెనుకనే ఉన్న డ్రెయిన్‌ను ఆక్రమించే ప్రయత్నాలు మొదలు పెట్టారు. డ్రెయిన్‌లో నీరు పారేందుకు లావుపాటి సిమెంట్ పైపులు వేసి వాటిపై మట్టి నింపి దానిపైన షాపులు ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారు. దీనిని గమనించిన స్థానిక నివాసితులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నీకు దిక్కున్న చోట చెప్పుకోమని, అవసరమైతే నీ స్థలంలోకి కూడా వస్తామంటూ బెదిరించారు. దీంతో సదరు నిర్వాసితులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొస్తే డ్రెయిన్‌పై వేసుకుంటే మీకేంటి అభ్యంతరం అంటున్నారని వారు వాపోయారు. దీనిపై టీపీవో కె.సాంబయ్యను వివరణ కోరగా తమ దృష్టికి రాగానే ఆ పని ఆపించామన్నారు. టైరు పంక్చర్ షాపులను అక్కడి నుంచి తీసేయమని చెప్పామన్నారు. మట్టి డ్రెయిన్‌ను సీసీ డ్రెయిన్‌గా మార్చబోతున్నామని చెప్పారు.

భూమికి జీవం - రైతుకు లాభం

అదే ప్రకృతి సేద్యం

- నవధాన్యాల సాగుతో భూమి సారవంతం!
- ప్రకృతి వ్యవసాయ విభాగం పల్నాడు జిల్లా మేనేజర్ కె అమలకుమారి
- కొత్తపాలెంలో నవధాన్యాల సాగు పరిశీలన

యడ్లపాడు: పల్నాడు జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ఓ ఉద్యమంగా మారుతోందని ఆవిభాగ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి చెప్పారు. గురువారం ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి కొత్తపాలెం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పీఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) విధానంలో సాగు చేస్తున్న తిరుపతిరావు, నాగేశ్వరరావు అనే రైతుల నవధాన్యాల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నవధాన్యాల సాగు భూమికి జీవంపోసే ప్రక్రియని. భూసారాన్ని పెంచి, పర్యావరణాన్ని పరిరక్షిస్తుందని స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో ప్రధాన పంటలకు ఆధారమైన పోషకాలను నేలను సిద్ధం చేసుకునేలా చేసే ఈ విధానం దోహదపడుతుందన్నారు.



కొత్తపాలెంలోని నవధాన్యాల సాగుని పరిశీలిస్తున్న అమలకుమారి

పీఎండీఎస్ వల్ల కలిగే అద్భుత లాభాలు

నేలజీవ వైవిధ్యం పెరిగి, సూక్ష్మజీవులు పెరుగుతాయని, చీడపురుగుల నిరోధకత పెరిగి, ప్రధాన పంటకు రక్షణ ఏర్పడుతుందన్నారు. నీటి నిల్వ సామర్థ్యం మెరుగవడంతో నేల గుల్లబారీ వానపాముల ఉనికి పెరుగుతుందని చెప్పారు. పీఎండీఎస్ సాగుతో పశుగ్రాసంగా కూడా ఉపయోగపడుతుందని, భూమి ఏడాది పొడవునా పచ్చగా ఉంటుందన్నారు. కృత్రిమ ఎరువుల అవసరం లేకుండా, స్థానికంగా లభించే పేడ, మూత్రం, సహజ కషాయాలతోనే పంటకు బలం ఇవ్వవచ్చన్నారు. ఈ విధానం వల్ల ఖర్చులు తగ్గి, ఆదాయం పెరగడంతో రైతులకు ఆర్థిక లాభం కూడా గ్యారెంటీ అన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా గ్రామాల్లో తయారు చేస్తున్న ఈ కిట్లు త్వరలో అన్నీ గ్రామాల్లో అందుబాటులోకి రానున్నాయని ప్రాజెక్టు మేనేజర్ తెలిపారు.

వర్షాలను సద్వినియోగం చేసుకుంటూ...

ఖరీఫ్ పంటకు 40 రోజుల ముందు, వర్షాకాలం ముంచెత్తక ముందే 30 రకాల పప్పు, నూనె, చిరు, తృణధాన్యాలు, ఆకుకూరల విత్తనాలతో కూడిన 20 కిలోల ప్రత్యేక కిట్లు రైతులకు అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. డ్వాక్రా మహిళల ద్వారా వీటిని తయారు చేయించిన వీటిని రైతుసేవా కేంద్రాలు, వీఐఎల్‌లు, వీహెచ్‌ఎల్‌ల ద్వారా లభించనున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జయ హనుమాన జ్ఞానగుణ సాగర

- వాడవాడలా హనుమజ్జయంతి వేడుకలు
- హనుమత్ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

యడ్లపాడు: మండలంలో హనుమత్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బోయపాలెంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో నూతన వాహనాలతో ప్రదక్షిణలు నిర్వహించారు. బోయపాలెం హైవే పక్కనే ఉన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం స్వామివారికి చందనాలంకరణ చేసి మామిడిపండ్లతో విశిష్ట పూజలు జరిపారు. హోమాలు సీతారాముల శాంతి కల్యాణం మహోత్సవంగా సాగింది. సొలస భూసమేత రంగానాయక స్వామి ఆలయ ప్రాంగణలోని సిద్ధాంజనేయ స్వామి ఉపాలయంలో విశేష అలంకరణ చేసి, మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. యడ్లపాడు పురాతన ఆలయం రణవీరాంజనేయ స్వామికి పాలభిషేకం చేసి మకర తోరణాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: పట్టణంలోని పలు ఆలయాలలో హనుమజ్జయంతిని గురువారం వైభవంగా నిర్వహించారు. సత్తెనపల్లిరోడ్డులోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో వేంచేసియున్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి మందిరంలో స్వామి వారికి 27 రకాలుగా అభిషేకాలు నిర్వహించారు.

పాలపాడురోడ్డులో

నరసరావుపేట: హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పాలపాడురోడ్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుతో పాటు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమత్ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రత్తిపాటి ప్రారంభించారు.

వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

శావల్యాపురం: హనుమాన్ జయంతి వేడుకలు మండలంలో కారుమంచి, శావల్యాపురం, మతుకుమల్లి, పోట్లూరు, వేల్పూరు, ఇర్లపాడు, వయ్యకల్లు తదితర గ్రామాల్లో భక్తులు వైభవంగా గురువారం నిర్వహించారు. శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో 108 లీటర్లు ఆవుపాలతో స్వామివారికి ఆలయ పూజారి రావిపాటి సాయిభరత్ వేదమంత్రాలు మధ్య అర్చనలు అభిషేకాలు ఆకుపూజలు ఘనంగా నిర్వహించారు. కారుమంచిలో స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు కె.కృష్ణామాచార్యులు, రంగాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు పులిహోర, దద్దోజనం తీర్థప్రసాదాలు అందజేశారు.

రొంపిచర్లలో....

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కొత్తపల్లి డొంకవద్దగల శ్రీ సంజీవ ఆంజనేయస్వామి, విప్పర్ల శివాలయంలోని హనుమంత ఆలయం, మర్రిచెట్టుపాలెం తద్దనాలమిట్ట, గోగులపాడు, అలవాల, అచ్చయ్యపాలెం, ఆరేపల్లి, రొంపిచర్ల, సంతగుడిపాడు, కొత్తపల్లి, ఎడ్వర్డ్‌పేట తదితర గ్రామాల్లోని ఆలయాల్లో వేడుకలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.



యడ్లపాడులోని ప్రత్తి ఆంజనేయస్వామి



బోయపాలెం ప్రసన్నాంజనేయ స్వామి



శావల్యాపురంలో అభిషేకం చేస్తున్న భక్తులు



నరసరావుపేటలో పంచముఖ ఆంజనేయస్వామి



గణపవరం-కావూరు డొంకలో స్వామి వారు



కొత్తపల్లి డొంకవద్దగల స్వామి మూలవిరాట్



నూజెండ్లలో పూజలు చేస్తున్న దంపతులు

నూజెండ్లలో

నూజెండ్ల: హనుమత్ జయంతి వేడుకలు పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో ఆంజనేయ స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు గురువారం నిర్వహించారు. మండల కేంద్రమైన నూజెండ్ల గ్రామంలో వేంచేసియున్న ఆంజనేయ స్వామి దేవాలయంలో దీక్షా స్వాముల ఇరుముడి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి క్రోసూరి రాం మోహన్‌చార్యులు సారథ్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పంచామృతాలతో అభిషేకాలు అర్చనలు తోమాల ధారణ పూజలు నిర్వహించారు. దంపతులచే ప్రత్యేక పూజలు చేపట్టారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: హనుమత్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో గల ఆంజనేయస్వామి ఆలయాలు, కోదండ రామాలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న హనుమత్ జయంతి వేడుకలు గురువారంతో ముగిశాయి. గణపవరం-కావూరు డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారిని అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారులు పరిమి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సువర్చలా సమేత వీరాంజనేయస్వామికి కళ్యాణం నిర్వహించారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కనమర్లపూడిలో...

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల వేడుకలు ఆలయ కమిటి సభ్యులు గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి సన్నిధిలో మహిళలు పొంగళ్లు పొంగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి అభిషేకాలు అర్చనలు విశేష పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోడెపూడి కొండలు, మాజీ సర్పంచ్ తన్నీరు అంకారావు,వైఎస్సార్ సీపీ నాయకులు బోడెపూడి శ్రీనివాసరావు, మండల బీసీ నాయకులు పోట్లూరు కొండలు కార్యకర్తలు అభిమానులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్థానిక ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు బందోబస్తు పర్యవేక్షించారు.

కొండకావూరులో...

నరసరావుపేటరూరల్: కొండకావూరులోని పురాతన శ్రీ రామభక్త వనవిహార ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకులు కిరణ్ కిషోర్ శర్మ ఆధ్వర్యంలో పూజాదికాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. విసెనకర్రలు, మామిడిపండ్లతో స్వామివారికి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే రెడ్డి నగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయంలో నిర్వహించిన హనుమాన్ జయంతి పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వినుకొండలో...



ఆలయంలో ప్రత్యేకపూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ: హనుమాన్ జయంతి పర్వదినం సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి, పుట్టాబత్తుని ఆంజనేయస్వామి, రంగనాయక స్వామి దేవాలయం, దక్షిణం బజారులోని గమిడి ఆంజనేయస్వామి దేవాలయంతో పాటు పలు చోట్ల స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుంటి ఆంజనేయస్వామి దేవాలయంలో జరిగిన ప్రత్యేకపూజల్లో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని పూజలు చేశారు.



స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేటలో దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



ఎన్టీఆర్ కాలనీ ఆంజనేయస్వామి గుడిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాం

- మళ్లీ ఎమ్మెల్యేగా డాక్టర్ గోపిరెడ్డి విజయానికి పాటుపడతాం
- నూతన జిల్లా, నియోజకవర్గ బాధ్యులు



డాక్టర్ గోపిరెడ్డితో నూతనంగా నియమితులైన షేక్ సిలార్‌బాష

నరసరావుపేట: వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు తమవంతు కృషిచేస్తామని నూతనంగా నియమితులైన పార్టీ జిల్లా, నియోజకవర్గ బాధ్యులు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో పండగ వాతావరణం నెలకొంది. పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులను నియమించిన విషయం విదితమే. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు వారి మద్దతుదారులతో హాజరై కృతజ్ఞతాపూర్వకంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని కలిసి దుశ్శాలువ కప్పి పూలదండలు వేసి ఘనంగా సత్కరించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తమ సేవలను పార్టీ గుర్తించి తమకు పదవులు అప్పగించినందుకు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి, డాక్టర్ గోపిరెడ్డిలకు ధన్యవాదాలు తెలియచేశారు. పార్టీ తమపై ఉంచిన బాధ్యత, నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషిచేస్తామని, తిరిగి నియోజకవర్గంలో డాక్టర్ గోపిరెడ్డి, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు తమవంతు శక్తియుక్తులతో పాటుపడతామని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సాతులూరి సుజాతపాల్, కార్యదర్శి గొర్రెపాటి అచ్యుతరావు, ఆర్గనైజేషన్ కార్యదర్శి షేక్ మొహమ్మద్‌గౌస్, పల్నాడు జిల్లా కోశాధికారి అన్నా చంద్రమోహన్, నియోజకవర్గ కార్మిక విభాగం అధ్యక్షులు షేక్ వలి, మైనార్టీ విభాగ అధ్యక్షులు షేక్ సిలార్ భాష, సోషల్ మీడియా విభాగ అధ్యక్షులు భూదాల కళ్యాణ్, వాణిజ్య విభాగ అధ్యక్షులు మిట్టపల్లి శేఖర్, నియోజకవర్గ విద్యార్థి విభాగ అధ్యక్షులు యర్రంరెడ్డి విజయ మనోహరరెడ్డి, నియోజకవర్గ అంగన్వాడీ విభాగ అధ్యక్షురాలు జొన్నలగడ్డ హెల్డా ఫ్లోరెన్స్ ఉన్నారు. నూతనంగా నియమితులైన జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ అధ్యక్షులను పార్టీ రాష్ట్ర ఇంటలెక్చువల్ విభాగ కార్యదర్శి ఇఎం స్వామి మాస్టర్, గిరిజన, ఎస్సీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షులు షేక్ రెహమాన్, పట్టణ నాయకులు షేక్ కరీముల్లా, గంటనపాటి గాబ్రియల్, చిన్న బుజ్జి, గోగుల మనోహర్‌యాదవ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, పాతర్ల చిన్ని, తిప్పరయ్య, ఆళ్ల మణికంఠరెడ్డి, మాణిక్యమ్మ, అనీలా, సయ్యద్ ఖాదర్బాషా, జీకే కరీముల్లా, సయ్యద్ భాష, గౌస్ పీర్, సయ్యద్ ఖాజా తదితరులు భారీగా పాల్గొని నూతనంగా నియమితులైన వారిని అభినందించారు.

వెనక్కు నడిచి కార్మికుల నిరసన

46వ రోజుకు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల నిరవధిక సమ్మె



పట్టణంలో వెనక్కు నడిచి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నరసరావుపేట: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు గురువారం వెనక్కు నడిచి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఏపి మున్సిపల్ వర్కర్స్-ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారంతో 46వ రోజుకు చేరుకుంది. తమను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోనందుకు నిరసనగా సీఐటీయూ జెండాలు చేబూని మున్సిపల్ కార్యాలయం నుంచి గడియారం స్తంభం మీదుగా పల్నాడు రోడ్డు నుంచి మళ్లీ కార్యాలయం వరకు వెనక్కు నడిచారు. జిల్లా గౌరవాధ్యక్షులు సిలార్ మసూద్ మాట్లాడుతూ హక్కుల సాధనకు పట్టుదలగా కార్మికులు ప్రదర్శిస్తున్న పోరాట పటిమను అభినందించారు. నెల మొత్తం పనిచేసినా 10 నుంచి 15 రోజులకు మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నారని, తాము ఆప్కాస్‌లో ఉన్నప్పటికీ సమానపనికి సమాన వేతనం రూ.21 వేలు ఎందుకివ్వరని ప్రశ్నించారు. పరిసరాల శుభ్రతకు పాటు పడుతున్న తమ పట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరి అవలంభించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమ దోపిడికి గురవుతున్న కార్మికులు కనీస వేతనాలు చెల్లించాలని అడగడం వారి ప్రాథమిక హక్కన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మున్సిపల్ కమిషనర్, అధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు.

జర్మన్ ఫ్రీ మాస్టర్ ప్రోగ్రాంకు ఎన్ఈసీ స్పాన్సర్



స్పాన్సర్‌షిప్ పొందుతున్న విద్యార్థులతో కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి

నరసరావుపేట రూరల్: జర్మనీలో ఫ్రీ మాస్టర్ ప్రోగ్రాం చేస్తున్న నలుగురు విద్యార్థులకు స్పాన్సర్ చేస్తున్నట్టు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి తెలిపారు. కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో స్పాన్సర్‌షిప్‌నకు అయ్యే రూ.4.5 లక్షల చెక్‌ను విద్యార్థులకు అందజేశారు.

ఈ సందర్భంగా మిట్టపల్లి చక్రవర్తి మాట్లాడుతూ కళాశాలకు చెందిన గాదె గోపీకృష్ణ, వడ్లమాను మహేంద్ర, జీ.వినయ్‌కుమార్, జాలాది రిచర్డ్ మార్క్‌లు జర్మనీలోని ఆర్‌డబ్ల్యూటీహెచ్ ఆ చెన్ యూనివర్సిటీలో ఎంఎస్ డిగ్రీ కోసం కళాశాల స్పాన్సర్ చేస్తున్నట్టు తెలిపారు. జర్మనీలో మాస్టర్ డిగ్రీ చేయడానికి కావల్సిన ముందస్తు అవసరాల కోసం జర్మనీ ప్రొఫెసర్లు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారని తెలిపారు. దీనివలన మాస్టర్ డిగ్రీలో చేరడం సులభతరం అవుతుందని వివరించారు.

జర్మనీలోని ఆర్‌డబ్ల్యూటీహెచ్ ఆచెన్ యూనివర్సిటీతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ బి.వెంకటశివ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను పెంపుదలకు ప్రత్యేక బృందాలు



సచివాలయ కార్యదర్శికి జ్ఞాపిక అందజేస్తున్న కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట: పురపాలక పరిధిలో ఆస్తిపన్ను పెంపుదలకు అధికారులు శ్రీకారం చుట్టారు. వచ్చే జూన్ 15 లోగా అండర్ అసెస్డ్, అన్‌అసెస్డ్ వాణిజ్య, గృహాలను గుర్తించి మళ్లీ వాటిపై అదనపు పన్నులు వేసేందుకు సమాయత్తం కావాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల జారీ చేసింది. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు అతిథి గృహంలో రెవెన్యూ అధికారులు, వార్డు సచివాలయాల పరిపాలనా కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు, ఎమినిటీస్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణం మొత్తం డోర్ టు డోర్ సర్వే చేసేందుకు కావల్సిన టీంలను ఏర్పాటు చేశారు. ఇటీవల ఐదుశాతం రిబేట్‌తో అడ్వాన్స్ టాక్స్ వసూలు చేయడంలో ప్రతిభ కనబర్చిన వార్డు సచివాలయ పరిపాలనా కార్యదర్శులు షేక్ కరిముల్లా, కె.భూలక్ష్మి, డి.వీరాంజనేయులు, జి.శాంతి, పి.రమేష్‌లను అభినందించి వారి జ్ఞాపికలను అందజేశారు. మున్సిపల్ ఇంజినీరు కె.కనకారావు, టీపీవో ఎ.సాంబయ్య, ఆర్ఐ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ జహంగీర్ పాల్గొన్నారు.

నల్లబర్లి పొగాకు వివరాలు నమోదు చేసుకోవాలి

నాదెండ్ల: నల్లబర్లి పొగాకు సాగు చేసిన రైతులు శుక్రవారంలోగా రైతు సేవా కేంద్రాల్లో పంట వివరాలు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్ చెప్పారు. మండలంలో ఈ ఏడాది 600 ఎకరాలకు పైగా నల్లబర్లి సాగు చేశారన్నారు. ఇప్పటికే కొందరు రైతులు పొగాకు దిగుబడిని అమ్ముకున్నారన్నారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిల్వ ఉంచిన రైతులు తమ వివరాలను రైతు సేవా కేంద్రాల వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. లేదా తమ సిబ్బంది రైతుల వద్దకు వచ్చి వివరాలు నమోదు చేసుకుంటారన్నారు. ఎన్ని ఎకరాలు సాగు చేశారు, ఎంత దిగుబడి వచ్చింది, దిగుబడిలో ఏ కోతకు ఎంత వచ్చిందనే వివరాలతో పాటూ ఇండ్లలో గానీ, పొలాల్లో గానీ, ఇతర ప్రాంతాల్లో నిల్వ ఉంచినట్లయితే వాటి వివరాలు తెలియజేయాలన్నారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన వ్యాపారులు కూడా వివరాలు తెలియజేయాలన్నారు. ఈక్రాప్ నమోదు చేయించుకున్న, చేయించుకోకపోయినా వివరాలు అందించాలన్నారు.

సాగర్ జలాలు విడుదల

శావల్యాపురం: తాగు నీటి అవసరాల నిమిత్తం సాగర్ జలాలు విడుదల చేస్తున్నట్లు ఎన్నెస్పీ డీఈ జరుగుల విజయలక్ష్మి గురు వారం తెలిపారు. డీఈ మాట్లాడుతూ మండలంలోని గంటావారి పాలెం గ్రామం సమీపాన అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు 250 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. వారం రోజుల పాటు జలాలు విడుదల అవుతాయ న్నారు.